**ఆంధ్రప్రదేశ్ మధ్య ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ**
**కార్పొరేట్ కార్యాలయం :: విజయవాడ**

నుండి
చీఫ్ జనరల్ మేనేజర్/ ఆర్ఏసి ,
ఎ.పి.సి.పి.డి.సి.ఎల్
విజయవాడ – 520 008

శ్రీ బి. తులసీదాస్,
సి-406, అమరావతి ఐకాన్,
తాడేపల్లి-522 501,
గుంటూరు జిల్లా

**లేఖ సంఖ్య: సి.జి.యమ్./ఆర్ఏసి/ సి.పి.డి.సి.ఎల్ / విజయవాడ/F. 76/డి. నెం. 368 /24, ది. 18 -01-24**

**అయ్యా**!

**విషయం:-** ఎ.పి.సి.పి.డి.సి.ఎల్- ఆర్.ఏ.సి.- ఆర్థిక సం. **2024-25**నకు ప్రతిపాదించబడిన టారిఫ్ ప్రతిపాదనలకు మీ అభ్యంతరాలు/ సలహాలకు ఎ.పి.సి.పి.డి.సి.ఎల్ సమాధానములు – పొందుపరచుట

**సూచిక:-** ఆర్థిక సం.2024-25 నకు ప్రతిపాదించబడిన టారిఫ్ ప్రతిపాదనలకు తమ అభ్యంతరాలు / సలహాలు

***

ఆర్థిక సం. 2024-25 నకు ప్రతిపాదించబడిన టారిఫ్ ప్రతిపాదనలకు తమ అభ్యంతరాలు మరియు సలహాలు అందినవి ధన్యవాదములు. సమాధానము ఈ క్రింద వివరించడమైనది.

**అభ్యంతరములు మరియు సమాధానములు :**

గౌరవ కమిషన్ వారు 2023 డిసెంబర్ 10వ తేదీన జారీ చేసిన బహిరంగ ప్రకటన మేరకు ఈ కింది విధంగా నివేదించుతున్నాము. వాటిని పరిశీలించి తగు నిర్ణయం చేయాలని కోరుతున్నాము.

1. గౌరవ కమిషన్ వారు 2024-25 సంవత్సరానికి సంబంధించిన వార్షికాదాయ అవసర నివేదిక (ఎఆర్ఆర్)లపైన, ఐదవ కంట్రోల్ పీరియడ్ కు సంబంధించిన మల్టీ ఇయర్ టారిఫ్ (ఎంవైటి) పైన ఒకేసారి పబ్లిక్ హియరింగ్ నిర్వహిస్తున్నారు. తొలుత ఎంవైటి ని నిర్ధారించి, ఆ ప్రాతిపదికన ఎఆర్ఆర్ చేపట్టడం ధర్మంగా ఉండేది. ఇప్పుడైనా ఈ రెండు అంశాలపై విడివిడిగా పబ్లిక్ హియరింగ్ నిర్వహించే విషయాన్ని పరిశీలించాలని కోరుతున్నాము. అలాగే హియరింగ్ లను మూడు డిస్కాముల పరిధిలో ప్రత్యక్షంగా నిర్వహించాలనీ కోరుతున్నాము.

**సమాధానము**: పంపిణీ మరియు రిటైల్ సరఫరా ఎ. ఆర్. ఆర్. లపై విడిగా బహిరంగ విచారణ నిర్వహించుట వలన ఒకే అభ్యంతరదారు రెండు ఎ.ఆర్.ఆర్.లపై అభిప్రాయాలు/సూచనలు/ అభ్యంతరములు వ్యక్తం చేయాలనుకున్నప్పుడు రెండు సార్లు కమీషన్ ముందు హాజరు కావలసియుండును. దీని వలన సమయం వృదా అవుతుంది. అందువలన బహిరంగ విచారణ తేదీలను విడదీసి రీ షెడ్యూల్ చేయవలెనని అభ్యంతరదారుని సూచన సమర్థనీయం కాదు. బహిరంగ విచారణలను మూడు డిస్కాముల పరిధిలో ప్రత్యక్షంగా నిర్వహించవలెనను అంశము గౌరవ కమీషన్ పరిధిలోనున్నది.

2. మూడు డిస్కాములవారు 2024-25 సంవత్సరానికి ఆదాయ లోటు రూ. 13,887.28 కోట్లుగా పేర్కొన్నారు. గతంలో వున్న టారిఫేనే కొనసాగిస్తాం (సోలార్ ప్యానెల్ తయారీదార్లకు భారీ రాయితీ, రైల్వేలకు టారిఫ్ పెంపు వంటివి మినహా) అన్నారు. అయితే ఈ భారీ లోటు పూడ్చడంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టంగా ఏం చేస్తుందో చెప్పకుండా జీవో 161 ప్రకారం లోటు భర్తీ ఉంటుందన్నారు. అయితే, డిస్కాములు ప్రస్తుతం ట్రూఅప్ చార్జీలతోపాటు ఎలాంటి ప్రతిపాదన, పబ్లిక్ హియరింగ్ నిర్వహించకుండానే ఎఫ్ పి పి సి ఎ (FPPCA) ఛార్జీల పేరిట యూనిట్ కు నెలకు 40 పైసల చొప్పున వినియోగదార్ల నుండి వసూలు చేస్తున్నారు. రానున్న ఏడాదిలోనూ అలా చేస్తారా లేదా అన్నది స్పష్టత లేదు. అట్టి వసూళ్లను అనుమతించరాదని, ట్రూఅప్ చార్జీల విధానాన్ని రద్దు చేయాలని కోరుతున్నాము.

**సమాధానము**: గౌరవ ఆంధ్రప్రదేశ్ విద్యుత్ నియంత్రణ మండలి వారు జారీచేసిన రెగ్యులేషన్ 2 ఆఫ్ 2023 ప్రకారం ఎఫ్ పి పి సి ఏ వసూలు చేయడం జరుగుచున్నది. అయితే ఎఫ్ పి పి సి ఏ నిర్ధారించుటకు ముందు గౌరవ కమిషన్ వారు తేదీ 10.02.23న పబ్లిక్ నోటీసు జారీ చేసి వినియోగదారులు మరియు వివిధ వర్గాల నుండి అభిప్రాయ సేకరణ చేపట్టిన తర్వాత నిర్ణయించడం జరిగినది. రానున్న ఏడాదిలో ఎఫ్ పి పి సి ఏ వసూలు అనేది వాస్తవంగా అయిన ఖర్చులకు కమిషన్ వారు అనుమతించిన ఖర్చులకు ఉన్న వ్యత్యాసం మేరకు నిర్ణయించడం జరుగుతుంది.

3. మూడు డిస్కాములకు 2024-25 సంవత్సరానికి 83,117.65 మియూ అవసరం కాగా 88,507.20 మియూ అందుబాటులో వున్నందున 5,389.55 మియూ మిగులు తేలుతుందని పేర్కొన్నాయి. అయితే, ఈ మిగులు విద్యుత్ అమ్మకం గురించి ఏమీ చెప్పలేదు కానీ 421.09 మియూ విద్యుత్ను స్వల్పకాలిక కొనుగోలు చేయాలన్నారు. మిగులు తేలిన విద్యుత్ కు ఫిక్సెడ్ చార్జీల పేరిట పెద్ద మొత్తాన్ని ముట్టజెప్పడం, మరోవైపు స్వల్పకాలిక కొనుగోళ్లలో అధిక ధర చెల్లించడం జరుగుతోంది. (2023-24 సంవత్సరంలో డిస్కాములు యూనిట్ ఎనిమిది రూపాయల కన్నా ఎక్కువ పెట్టి కొన్నట్లు అంచనా) కాబట్టి వినియోగదార్లపై భారం పడని రీతిలో మిగులు విద్యుత్ అమ్మకం, స్వల్పకాలిక కొనుగోళ్లలో డిస్కాములకు పరిమితులను, ఈ వ్యవహారాల్లో పారదర్శకమైన విధానాన్ని రూపొందించాలని కోరుతున్నాము.

**సమాధానము**: ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలో ఎక్కువ పునరుత్పాదక మూలములు ఉండటం వలన ఆ విద్యుత్ ఉత్పత్తి రోజువారీగా సీజన్ల వారీగా మరియు ఒకే రోజులో టైం బ్లాక్ ల వారీగా ఎక్కువ వ్యత్యాసము ఉండును అందువలన ఏ ఆర్ ఆర్ లో అంచనా వేసిన మిగులు విద్యుత్ సంభావ్యత మాత్రమే కానీ వాస్తవ మిగులు అనునది రియల్ టైం లో గ్రిడ్ డిమాండ్ మరియు సరఫరా పరిస్థితిలపై ఆధారపడుతుంది.

రియల్ టైం లో అంచనా వేసిన గ్రిడ్ డిమాండ్ వాతావరణ పరిస్థితుల వలన మారుతుంది మరియు అంచనా వేసిన విద్యుత్ విద్యుత్ ఉత్పత్తి థర్మల్ విద్యుత్ ఉత్పత్తి యూనిట్ల అలభ్యత మరియు పునరుత్పాదక విద్యుత్ లోని వ్యత్యాసము వలన మారుతుంది. రియల్ టైం లో లోడు ఉత్పత్తి సమతుల్యత కోసం గ్రిడ్ నుండి ఎక్కువ/తక్కువ విద్యుత్తును తీసుకోవడం జరుగుతుంది. గ్రిడ్ డిమాండ్ కన్నా ప్రకటిత లభ్యత తక్కువగా ఉన్నప్పుడు ఒప్పంద మూలములన్నింటి నుంచి ప్రకటిత లభ్యత అయిపోయిన తరువాత వినియోగదారులకు 24X7 నిరంతర విద్యుత్ ను అందించుట కొరకు గౌరవ కమిషన్ వారు జారీ చేసిన రెగ్యులేషన్ సంఖ్య 1/2022 ప్రకారము ఏపీ డిస్కం లు స్వల్పకాలిక విద్యుత్ కొనుగోలు చేయుచున్నవి. స్వల్పకాలిక కొనుగోలు ఆ సమయంలో ఉన్న పోటీ రేట్లను అనుసరించి చేయడం జరుగుచున్నది.

4. రాష్ట్ర ప్రభుత్వం మూడు డిస్కాములకు సబ్సిడీగా చెల్లించవలసినది రూ. 22,234.60 కోట్లు బకాయిగా ఉందని పేర్కొన్నాయి. ఇంత భారీమొత్తాన్ని ప్రభుత్వం బకాయిపెట్టడంతో డిస్కాములు అధిక వడ్డీలకు రుణాలు తీసుకోవలసివస్తోంది. ఆ భారం వినియోగదార్లపైనే పడుతుంది కనుక ప్రభుత్వం సకాలంలో బకాయి చెల్లించేలా గౌరవ కమిషన్ వారు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నాము.

**సమాధానము**: పై అంశము గౌరవ కమీషన్ వారి పరిధిలోనిది.

5. యాభై వేల రూపాయలకన్నా ఎక్కువ మొత్తాలు బాకీపడ్డ వినియోగదార్లు 2023 సెప్టెంబర్ నాటికి ఎస్పిడిసిఎల్ కు రూ. 3237.32 కోట్లు, ఇపిడిసిఎల్ కు రూ. 1295.51 కోట్లు చెల్లించవలసివుంది. అయితే ఈ బకాయిల వసూళ్లకు డిస్కాములు చేస్తున్న కృషి, అలాగే అందుకు వారికి ఎదురవుతున్న ఇబ్బందులు పేర్కొంటే బాగుండేది. యాభై వేల రూపాయలకన్నా ఎక్కువ మొత్తాల బాకీల వసూలుకు నిర్దిష్ట కాల పరిమితితోసహా ఒక విధానాన్ని రూపొందించి అమలు చేయాలని కోరుతున్నాము.

**సమాధానము**: వివిధ కేటగిరీలకు చెందిన వినియోగదారుల నుండి రావలసిన విద్యుత్ ఛార్జీల వసూలు కొరకు విద్యుత్ చట్టం అనుమతించిన వివిధ మార్గాలు ద్వారా చార్జీలు వసూలు చేయుట జరుగుచున్నది. ముందుగా నిర్ణీత వ్యవధిలో విద్యుత్ ఛార్జీలు చెల్లించని వారికి సరఫరా నిలిపివేయుట జరుగును. అప్పటికి చార్జీలు చెల్లించని యెడల మూడు నెలల తర్వాత నోటీసు ఇచ్చి తదుపరి సర్వీసు పూర్తిగా తొలగించబడును. మరియు సర్వీసు తొలగించిన నాటికి ఉన్న సెక్యూరిటీ డిపాజిట్ ను బకాయిలకు సర్దుబాటు చేసి మిగిలిన మొత్తం వసూలు కొరకు రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రయోగించబడును. యాభై వేల రూపాయలకు మించిన బకాయిల వసూలునకు మీ సూచన పరిశీలించి అమలుచేయుటకు గల సాధ్యాసాధ్యాలు పరిశీలించబడును.

6. రాష్ట్రంలో స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్ల ఏర్పాటుపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత నెలకొంది. వ్యవసాయ పంప్ సెట్లకు వాటిని ఏర్పాటు చేయడానికి సర్కారు ఖజానానుండి వేల కోట్ల రూపాయలను అదానీ గ్రూప్, షిరిడి సాయి ఎలక్ట్రికల్స్ ఇంకా ఇతర ప్రైవేటు కంపెనీలకు కట్టబెడుతున్నారని మీడియా కోడై కూస్తోంది. అదే విధంగా ప్రస్తుతం పని చేస్తున్న మీటర్ల స్థానంలో స్మార్ట్ మీటర్లను ఇతర కనెక్షన్లకూ సదరు వినియోగదార్ల అనుమతి లేకుండా ఏర్పాటు చేయడం విద్యుత్ చట్టం సెక్షన్ 47(5) ప్రకారం చెల్లదు. గడచిన ఏడాది పబ్లిక్ హియరింగ్ సందర్భంగా నాతోపాటు (టారిఫ్ ఆర్డర్ పేరా 271) ఇంకొందరు అభ్యంతరదార్లు తమకు ఈ విషయమై విన్నవించియున్నాము. ఆ మేరకు గౌరవ కమిషన్ వారు స్పందించి ఒపి81 తేదీ 27.12.2023 లో స్మార్ట్ ప్రిపెయిడ్ మీటర్లు ఏర్పాటును ప్రస్తుతం తిరస్కరించి, కమిషన్ వద్దకు తిరిగి సాధారణ పద్ధతిలో రావాలంటూ ఉత్తర్వులిచ్చినందులకు ధన్యవాదములు. ప్రజా ధనం వృథా కాకుండా నివారించేందుకు ఇప్పుడు అవసరంలేని స్మార్ట్ ప్రీపెయిడ్ మీటర్ల ఏర్పాటును తిరస్కరించాలని కోరుతున్నాము.

**సమాధానము**: ఆర్.డి.ఎస్.ఎస్. పథకంలో భాగంగా స్మార్ట్ మీటర్లు గౌరవ కమీషన్ వారి ఆమోదం తీసుకున్న తర్వాతనే ఏర్పాటు చేయడం జరుగుతుంది.

7. పైన పేర్కొన్న అంశాలతోపాటు ఇంకొన్ని విషయాలపై కొద్ది రోజుల తరువాత మేము సమర్పించే సూచనలు/ అభ్యంతరాలను గౌరవ కమిషన్ వారు పరిగణనలోకి తీసుకోవాలని, పబ్లిక్ హియరింగ్ లో విజయవాడ ఎస్ఇ కార్యాలయం నుండి పాల్గొనుటకు నన్ను అనుమతించాలని మనవి చేస్తున్నాను. వీలుంటే జనవరి 30వ తేదీ ఉదయం పొద్దునే అవకాశం కల్పించాలని కోరుతున్నాను.

**సమాధానము**: గౌరవ కమిషన్ వారు ఆ.సం.2024-25 యొక్క ఎ. ఆర్. ఆర్ ప్రతిపాదనలపై బహిరంగ విచారణ వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఎ.పి.ఇ.పి.డి.సి.ఎల్., విశాఖపట్టణం నుండి తేది. 29.01.2024, 30.01.2024 మరియు 31.01.2024 వరకు 10.30 AM నుండి 1.00 PM వరకు మరియు 2.00 PM నుండి 4.30 PM వరకు జరుగుతాయి. జిల్లా కేంద్రాలలో లోని సూపరింటెండింగ్ ఇంజనీర్ /ఆపరేషన్ మరియు ఇతర ఎగ్జిక్యూటివ్/డివిజనల్ ఇంజనీర్ /ఆపరేషన్ కార్యాలయములో ఈ వీడియో కాన్ఫరెన్స్ సదుపాయం కలుగజేయబడినది. కావున మీరు పైన తెలిపిన తేదీలలో ఏదేని పైన తెలిపిన కార్యాలయములనందు వీడియో కాన్ఫరెన్స్ లో పాల్గొని మీయొక్క సలహాలు/ అభ్యంతరములను తెలుపగలరు.

**తమ విధేయులు**

**చీఫ్ జనరల్ మేనేజర్/ఆర్ఏసి**
**ఎ.పి.సి.పి.డి.సి.ఎల్, విజయవాడ**

గౌరవ సెక్రటరీ / ఆంధ్రప్రదేశ్ విద్యుత్ రెగ్యులేటరీ కమీషన్ / హైదరాబాదు వారికి నకలు సమర్పించడమైనది.